పని ఉన్నా.. పైసలు రాక

హుస్నాబాద్ మెట్ట ప్రాంతంలో వానలు ఆశించిన మేర పడలేదు. దీంతో వరినాట్లు వేసే పనులు ఆలస్యమవుతున్నాయి. ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు మూడు నెలల కింద చేసిన పనులకు కూలీ డబ్బులు అందలేదు. దీంతో పది వారాలుగా డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. ఉపాధి కూలీ డబ్బులు రాకపోవడంతో పనులు చేసేందుకు కూలీలు ముందుకు రావడం లేదు. వెంటనే కూలి డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- 'ఉపాధి' డబ్బులకు ఎదురు చూపులే
- మూడు నెలలుగా అందని కూలి డబ్బులు
- గ్రామాల్లో పనులకురాని ఖైనం


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

హుస్నాబాద్‌రూరల్: జిల్లాలో 1,28,795 జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో 2,20,381 మంది కూలీలు ఉన్నారు. జూన్ వరకు ప్రతీ రోజూ జిల్లా వ్యాప్తంగా 61 వేలకుపైగా కూలీలు ఉపాధి హామీ పనులతో జీవనోపాధి పొందేవారు. కూలీలకు క్రమం తప్పకుండా డబ్బులు చెల్లించిన అధికారులు గత పది వారాలుగా డబ్బులు చెల్లించడం లేదు. గ్రామాల్లో పనులు చేయించిన ఫీల్డు అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శుల వద్దకు నిత్యం కూలీలు వచ్చి తమకు డబ్బులు ఎప్పుడు వస్తాయని అడుగుతుండటంతో వాళ్లు పనులకు పిలవడానికి భయపడుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు కూలీలు రాకపోవడంతో అధికారులు ఒకరిద్దరు కూలీలతో మొక్కలు నాటించే పనులు చేయిస్తున్నారు.

సాగు పనులు లేవు

సాగు పనులు అక్కడక్కడ సాగుతున్నాయి. నాట్లు వేయడం, పత్తిలో కలుపు తీసే పనులు లేకపోవడంతో కూలీలు కాలక్షేపం చేస్తున్నారు. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పనులకు వెళ్దామనుకున్న కూలీలకు చేసిన పనులకు డబ్బులు రాకపోవడంతో ఆ పనులకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పైసా రాలేదు



మా ఇంట్లో ఇద్దరం ఉపాధి హామీ పనికి వెళ్తాం. నెలల తరబడి డబ్బులు రాకపోతే మేము కుటుంబాలను ఎలా పోషించుకోవాలి. బయట పనులకు పోదామంటే వానలు లేక రైతులు నాట్లు వేయడంలేదు. నార్లు పోసి వానల కోసం ఎదురు చూస్తున్నారు. ఉపాధి హామీ డబ్బులు రావు, బయట పనులు దొరకడం లేదు. అధికారులు డబ్బులు వచ్చేలా చూడాలి.

– వెంకట నారాయణ, గాంధీనగర్

కూలీల డబ్బులు రావాల్సి ఉంది



ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు వారం రోజులకు వేతనాలు ఇచ్చేవాళ్లం. ఇప్పుడు ఆలస్యమైంది. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేసినట్లు సమాచారం ఉంది. వారంలో కూలీలకు వారి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమవుతాయి. గ్రామాల్లో వనమహోత్సవం జరుగుతోంది. మొక్కలు నాటేందుకు కూలీలతో పనులు చేయిస్తున్నాం.

– పద్మ, ఏపీఓ, హుస్నాబాద్

ఆలయ ఏఈఓను సస్పెండ్ చేయాలి

- సీపీఎం మండల కార్యదర్శి సత్తిరెడ్డి


మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి సత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఏఈఓను సస్పెండ్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలయంలో ఏఈఓగా విధులు నిర్వహిస్తున్న గంగా శ్రీనివాస్ గతంలో బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో అవినీతికి పాల్పడితే దేవదాయ శాఖ సస్పెండ్ చేసిందన్నారు. ఇప్పుడు కొమురవెల్లి మల్లన్న ఆలయ కాంట్రాక్టర్లను బెదిరించి కమీషన్లు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. కొద్ది రోజుల క్రితం ఆలయ ఈవో బాలాజీ సమక్షంలో తోటి ఉద్యోగిపై భౌతిక దాడికి పాల్పడ్డాడని , స్వామివారి బ్రహ్మోత్సవాల్లో వీవీఐపీ పాసులు అమ్ముకుని పట్టుబడ్డాడని తెలిపారు. ఇప్పటికే ఆయనపై రెండు కేసులు నమోదయ్యాయన్నారు. మంగళవారం ఆలయంలో జరిగిన హుండీ లెక్కింపులో బంగారు గొలుసు మాయమై చెత్తబుట్టలో లభ్యమైన ఘటనలో ఏఈఓ పాత్ర ఉందన్నారు. ఈ విషయంలో అతడిని విచారించాలని దేవాదాయ శాఖ అధికారులను కోరారు. ఏఈఓ అవినీతికి పాల్పడుతున్నా ఈఓ అతడికి సహకరిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై త్వరలో దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, వుల్లంపల్లి సాయిలు, బక్కెల్లి బాల కిషన్, సార్ల యాదయ్య, కర్రోల్ల ఎల్లయ్య, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పోలీస్ స్టేషన్‌లో కార్యకలాపాలు ప్రారంభం


నూతన భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎస్‌ఐ రాజు, సిబ్బంది

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లిలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనంలో బుధవారం ఎస్‌ఐ రాజు కార్యకలాపాలు ప్రారంభించారు. కొమురవెల్లి నూతన మండలంగా ఏర్పాటైనప్పటి నుంచి మల్లికార్జున స్వామి వసతి గృహంలో పోలీస్ స్టేషన్ కొనసాగింది. ప్రభుత్వం రూ.కోటి వ్యయంతో పోలీస్ స్టేషన్ భవనం నిర్మించినా అందుబాటులోకి రాలేదు. ఎట్టకేలకు నూతన భవనంలో కార్యకాపాలు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌ఐ, పోలీసులు పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాంమూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం


మిరుదొడ్డిలో పీర్ల ఊరేగింపు


చిన్నకోడూరులో..

మొహర్రంను ముస్లింలు త్యాగానికి ప్రతీకగా భావిస్తారు. ఈ సందర్భంగా తొమ్మిది రోజుల క్రితం ఏర్పాటు చేసిన పీర్లను ఊరేగిస్తారు. యువకులు అసైదుల్లా ఆడారు. పీర్లతో మత పెద్దలు చెరువు వద్దకు ఊరేగింపుగా వెళ్లి వాటిని జలంతో శుద్ధి చేశారు. పీర్ల ఊరేగింపులో కులమతాలకు అతీతంగా పాల్గొన్నారు.


మర్పడ్గలో ..


నాగసముద్రాలలో..

వనమహోత్సవంలో ప్రణాళిక ఏదీ ?


రాంచంద్రాపూర్ గ్రామంలో విద్యుత్ తీగల కింద నాటిన మొక్కలు

కోహెడరూరల్(హుస్నాబాద్): వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటడంలో పోటీ పడుతున్న అధికారులు సరైన ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తున్నారు. మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామ శివారు శివాలయం సమీప గాగిల్లాపూర్ వెళ్లే రోడ్డుకు ఇరువైపులా గతంలో మొక్కలు నాటారు. అవి ఏపుగా పెరిగాయి. అయితే చెట్ల కొమ్మల కింద విద్యుత్ తీగలు ఉంటంతో వాటిని నరికివేసే అవకాశం ఉంది. గతంలో ఇలా పెరిగిన చెట్లను నరికివేశారు. సరైన ప్రణాళికతో మొక్కలను నాటించాలని కోరుతున్నారు.

మంత్రిని కలిసిన కిరణ్

చేర్యాల(సిద్దిపేట): మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని తన తండ్రి, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసినట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి మంత్రితో చర్చించానన్నారు. అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి పత్రం అందజేసినట్లు చెప్పారు. వారి వెంట ఇటికాలపల్లి మాజీ సర్పంచ్ లింగం ఉన్నారు.


మంత్రితో నాగపురి కిరణ్, రాజలింగం

తొలి కాలాపానీ ఖైదీ మౌల్వి అల్లావుద్దీన్ హైదర్


మాట్లాడుతున్న మిల్లి కౌన్సిల్ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దేశ స్వాతంత్య్ర కోసం బ్రిటిష్ వారితో పోరాడి కాలాపానీ జైల్లో నిర్బంధించబడ్డ తొలి ఖైదీ హైదరాబాద్ సంస్థానంలోని మక్కా మసీద్‌లో ఇమామ్‌గా పనిచేసిన మౌల్వి అల్లావుద్దీన్ హైదర్ అని సిద్దిపేట మిల్లి కౌన్సిల్ వ్యవస్థాపక సభ్యులు సాజిద్, ఆరిఫ్ ముజఫర్, పాషా అన్నారు. బ్రిటిష్ ప్రభుత్వంపై హైదర్ తిరుగుబాటు చేసిన రోజును పురస్కరించుకుని బుధవారం సిద్దిపేటలో మిల్లి కౌన్సిల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. 1857 జూలై 17న తుర్రాబాజ్ ఖాన్, మరో 500 మందితో కలిసి బ్రిటిష్ పాలకులపై మొదటి బహిరంగ తిరుగుబాటు చేశారన్నారు. భారత దేశ స్వాతంత్య్ర సంగ్రామంలో ఎంతో మంది తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలారన్నారు. స్వాతంత్య్ర సమర యోధులను ఏటా స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో మిల్లి కౌన్సిల్ సభ్యులు వలియొద్దీన్, మొహమ్మద్ సాధిక్, ఇమాదుద్దీన్, అశ్వక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోచమ్మకు బోనాలు


కోహెడలో బోనాలతో వెళ్తున్న మహిళలు

కోహెడ(హుస్నాబాద్): ఆషాఢ మాసం పురస్కరించుకొని మండల కేంద్రంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం గ్రామ దేవత పోచమ్మ తల్లికి బోనాల ఉత్సవం నిర్వహించారు. మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. యాదవ సంఘం ప్రతినిధులు ధరించిన పసుపు రంగు వస్త్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

రుణమాఫీపై షరతులు సరికాదు


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గజ్వేల్‌రూరల్: రైతులందరికీ కాంగ్రెస్ పార్టీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత షరతులు పెట్టడం సిగ్గుచేటని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కపటప్రేమ చూపుతోందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన దాఖలాలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారికి మాత్రమే రుణమాఫీ వర్తింపజేస్తామనడం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయాలని, లేనిపక్షంలో బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బండారు మహేష్, జనార్దన్, వెంకటేష్, కుమార్ గౌడ్, ప్రసాద్, సందీప్, వెంకట్‌రెడ్డి, నవీన్, ఆనంద్, సాయిగౌడ్, స్వామి పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని మాజీ సర్పంచ్ బీంరెడ్డి సత్యవతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆమె చెంచెల్చెర్వుపల్లిలో మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత షరతులు విధించడం సరికాదన్నారు. ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలన్నారు.

చినుకు పడితే చిత్తడే..


గుంతలు పడ్డ దుబ్బాక బస్టాండ్ ప్రధాన మార్గం

దుబ్బాకటౌన్: చినుపడితే దుబ్బాక బస్టాండ్‌లోకి వెళ్లే ప్రధాన మార్గం చిత్తడిగా మారుతోంది. బస్టాండ్ లోపలికి వెళ్లే ప్రయాణికులు ఎక్కడ జారిపడతామోనని భయపడుతున్నారు. రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించిన బస్టాండ్ ప్రధాన మార్గంలో గుంతలు పడటంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలి


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి(సిద్దిపేట): సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. బెజ్జంకి సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న కేడీసీసీ బ్యాంక్ నూతన భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీలోపు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అవుతుందన్నారు. సహకార సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్వహించడంతోపాటు కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించడం అభినందనీయమన్నారు. జిల్లా సీఈఓ సత్యనారాయణ, బెజ్జంకి ప్యాక్స్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు, పాలకవర్గ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎంలు మహేష్, హన్మంతరావు, బెజ్జంకి సీఈఓ వాసు, మేనేజర్ ప్రవీణ్, వైస్ చైర్మన్ బండి రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, దుర్గాప్రసాద్, దేవేందర్‌రెడ్డి, బాలనర్సు తదితరులు పాల్గొన్నారు.



గొల్లపల్లిలో మాట్లాడుతున్న లోడి సంస్థ డైరెక్టర్ ఇన్నారెడ్డి

గొల్లపల్లిలో చెక్‌డ్యాం నిర్మాణం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం కేశనాయక్‌తండా గ్రామ పరిధిలోని గొల్లపల్లిలో మానోస్ యూనిదాస్ సహకారంతో చెక్‌డ్యామ్‌ను లోడి సాంఘిక సేవా సంస్థ నిర్మించింది. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ఇన్నారెడ్డి మాట్లాడుతూ నీటి నిల్వలు కార్యక్రమంలో గొల్లపల్లిలో చెక్‌డ్యామ్‌ను నిర్మించామన్నారు. చెక్ డ్యామ్ నిర్మాణంతో భూగర్భ జలాలు పెరిగి బావులు, బోరుబావుల్లో జలమట్టం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో లోడి సంస్థ కో–ఆర్డినేటర్ బాలశౌరి, మండల కో–ఆర్డినేటర్ కోడం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సంబరాలు

- సేవల గుర్తింపుపై హర్షం


సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామీణ వైద్యులు

హుస్నాబాద్: గ్రామీణ వైద్యుల సేవలను గుర్తించి వారికి పారితోషికం ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో గ్రామీణ వైద్యులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల క్రితం దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో గ్రామీణ వైద్యులను గుర్తించి వారికి శిక్షణ ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తమను గుర్తించలేదన్నారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు గీకురు వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు సుదర్శన్, నాయకులు ముంతాజ్, శ్రీనివాస్, బాలయ్య, ష, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలి

- శాసన మండలి సభ్యుడు రఘోత్తంరెడ్డి

మర్కూక్(గజ్వేల్): ఆధ్యాత్మిక చింతనతోనే శాంతి పరిఢవిల్లుతుందని, ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలని శాసన మండలి సభ్యుడు కూర రఘోత్తంరెడ్డి అన్నారు. మండలంలోని భవానందాపూర్ గ్రామంలో శ్రీ పాండురంగస్వామి ఆషాఢి ఉత్సవాలకు హాజరయ్యారు. రుక్మిణీ పాండురంగ స్వామికి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాండురంగ స్వామి కృపాకటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఆశ్రమంలో ఉదయం స్వామి వారికి తొలి ఏకాదశి సందర్భంగా విశేష పూజ, అఖండ భగవన్నామం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.


రుక్మిణీ పాండురంగ స్వామి సన్నిధిలో శాసన మండలి సభ్యుడు రఘోత్తంరెడ్డి

బదిలీ టీచర్లను రిలీవ్ చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ


వినతిపత్రం ఇస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ వలీ అహ్మద్, తప్పెట్ల యాదగిరి మాట్లాడారు. ఇటీవల జిల్లాలో ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయన్నారు. కొన్ని మండలాల్లో మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ల సమన్వయం లోపంతో కొంతమంది ఎస్జీటీ ఉపాధ్యాయులు బదిలీ అయినప్పటికీ వారిని రిలీవ్ చేయకపోవడంతో అదే పాఠశాలలో పనిచేయాల్సి వస్తుందన్నారు. బదిలీ అయినా ప్రయోజనం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. పదోన్నతులు, బదిలీల అనంతరం ఏర్పడిన ఖాళీల వివరాలను తెలియజేయాలన్నారు. వేసవి సెలవుల్లో పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవుల మంజూరు ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు చంద్రారెడ్డి, చిర్ర యాదగిరి, కృష్ణ, కనకరాజు, వెంకట కిరణ్, ప్రశాంత్ కుమార్, శివలింగం, వెంకటేశం, రామచంద్రం, సాబీర్, రాజేందర్, యాదయ్య , శ్రీనివాస్, రాజలింగం, భిక్షపతి, శ్రీనివాస్, నరసింహులు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి


చేర్యాలలో పూజలు చేస్తున్న భక్తులు

హుస్నాబాద్: తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం భక్తులు ఆలయాలను సందర్శించారు. శ్రీ మహావిష్ణువును స్మరిస్తూ పూజలు చేశారు. విష్ణు సహస్రనామ పారాయణం చేస్తూ హోమం నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు ఆలయాలలో స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో ..

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందరర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీమహా విష్ణువు యోగ నిద్రలోకి వెళ్లిన పర్వదినాన్ని హిందూ సమాజం తొలి పండుగ ఏకాదశిగా జరుపుకుంటారు. ఆలయంలో నిర్వహించిన విష్ణు సహస్ర నామ పారాయణం, వైదిక కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

బీరప్ప కామరాతి ఆలయంలో..

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని బీరప్ప కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప కామరాతి సమేత అక్క మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కురుమ కుల ఆనవాయితీగా పెద్ద కురుమ ఇంటి నుంచి బోనం తీసుకుని ఒగ్గుడోలు వాయి ద్యాలతో ఊరేగింపుగా వెళ్లి బోనం చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు.